

కొనసాగుతున్న రైల్వే వంతెన పనులు

# శరవేగంగా..

**కొనసాగుతున్న రైల్వే వంతెన నిర్మాణ పనులు**

- కేసీఆర్ ప్రభుత్వంలో రూ.57.71 కోట్లు మంజూరు
- ఆదిలాబాద్, తాంసి, తలమడుగు ప్రజల అవస్థలు దూరం

ఆదిలాబాద్, డిసెంబర్ 18(నమస్తే తెలంగాణ) : ఆదిలాబాద్ పట్టణవాసులతోపాటు తాంసి, తలమడుగు మండలాల్లోని గ్రామాలకు చెందిన ప్రజలు ఆదిలాబాద్‌కు రావాలంటే రైల్వే ట్రాక్ దాటాలి. తాంసి బస్టాండ్‌తోపాటు స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో రైల్వేట్రాక్‌లు ఉండడంతో రైళ్లరాకపోకల సమయంలో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. పట్టణంలోని ఖుర్షిద్‌నగర్, సందరయ్యనగర్, గాంధీనగర్, తాటిగూడ రణదేవనగర్, హమాలీవాడ, భాగ్యనగర్, క్రాంతినగర్, జై జవాన్‌నగర్ ప్రాంతాల నుంచి వాహనదారులు రైళ్లువచ్చే సమయంలో గేట్లు మూసివేయడంతో అవస్థలు పడుతున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ యార్డుకు రైతులు తమ పంటను అమ్ముకునేందుకు తాంసి బస్టాండ్ వద్ద రైల్వే ట్రాక్ దాటాలి. ప్రస్తుతం పత్తి కొనుగోళ్లు జరుగుతుండడంతో రోజు వందలాది వాహనాల్లో రైతులు పత్తిని విక్రయించడానికి మార్కెట్‌కు తీసుకొస్తున్నారు. తాంసి బస్టాండ్ నుంచి మహారాష్ట్రకు వెళ్లే అంతర్రాష్ట్ర రహదారి ఉండడంతో ఈ ప్రాంతంలో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటాయి. రైల్వే గేట్ పడడంతో వాహనాలు భారీ సంఖ్యలో నిలిచిపోయి ట్రాఫిక్ సమస్యలు తలెత్తున్నాయి. దీంతో రైల్వే వంతెన నిర్మాణం జరపాలని పట్టణవాసులు కోరుతున్నారు.

## రూ.57.71 కోట్లు మంజూరు

రైల్వే బ్రిడ్జి నిర్మించాలని పట్టణ ప్రజలు ఏళ్లుగా కోరుతున్నారు. మాజీ ఎమ్మెల్యే జోగు రామన్న వంతెన నిర్మాణానికి ప్రత్యేక శ్రద్ధ వహించారు. ప్రయోజనాలను వివరిస్తూ గత ప్రభుత్వానికి సూచనలు చేశారు. స్పందించిన కేసీఆర్ ప్రభుత్వం బ్రిడ్జి నిర్మాణానికి రూ.57.71 కోట్లు మంజూరు చేసింది. టెండర్ ప్రక్రియ పూర్తికాగా నాలుగు నెలల కిందట పనులు ప్రారంభమయ్యాయి. పిల్లర్ల పనులు వేగంగా జరుగుతున్నాయి. తాంసి బస్టాండ్ వద్ద రైల్వే అండర్ బ్రిడ్జి పట్టణ ప్రజలు వ్యవసాయ మార్కెట్ యార్డుకు పోయేందుకు సౌకర్యంగా ఉంది. నిర్మాణం తర్వాత కింది నుంచి వాహనాల రాకపోకలు కొనసాగుతాయి. స్పిన్నింగ్ మిల్ ప్రాంతంలో రైల్వేపై వంతెన నిర్మిస్తారు. కలెక్టర్ చౌక్ నుంచి ఎల్ఐసీ కార్యాలయం నుంచి వాహనాలు తాంసి, తలమడుగు మండలాలతో పాటు పట్టణంలోని పలు కాలనీలు, మార్కెట్‌యార్డుకు పోవడానికి ఈ బ్రిడ్జి ఉపయోగపడుతుంది. కేసీఆర్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందునా వంతెన నిర్మాణం జరుగుతుండటంపై ప్రజలు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

### ఇప్పడంతా టాటూ క్రేజ్



నేను హైదరాబాద్‌లో శిక్షణ పొందిన. మంచిర్యాలలో లవీష్ టాటూ సెంటర్ పెట్టుకున్న. మా వద్ద వెరైటీ డిజైన్ల టాటూలు ఉన్నాయి. ఇప్పుడంతా టాటూ క్రేజ్ నడుస్తోంది. యువత నలుగురిలో డిఫరెంట్‌గా కనిపించడానికి వేయించుకుంటున్నారు. గిరాకీ బాగుంది.

*- జంపాల రవీందర్, టాటు ఆర్టిస్ట్, మంచిర్యాల*

# టాటూ ట్రెండ్

**మంచిర్యాల జిల్లా వ్యాప్తంగా వెలిసిన సెంటర్లు**

- మల్టీ కలర్స్‌లో అనేక వెరైటీలు
- నయా లుక్ కోసం ఉత్సాహం చూపుతున్న యువత
- డిజైన్‌ను బట్టి రూ. 500 నుంచి రూ. 50 వేల దాకా తీసుకుంటున్న నిర్వాహకులు

మంచిర్యాల ఏసీసీ, డిసెంబర్ 18 : ప్రస్తుతం టాటూ ట్రెండ్ నడుస్తున్నది. నేటి ఫ్యాషన్‌లో అది కూడా ఓ భాగమైంది. జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా పచ్చబొట్టు నిలుస్తున్నది. ప్రధానంగా యువత దీనిపై ఎంతో క్రేజ్ చూపిస్తున్నది. సెలబ్రెటీల నుంచి సామాన్యుల వరకు డిఫరెంట్‌గా కనిపించాలని, కొత్త లుక్ కోసం శరీరంపై టాటూలు వేయించుకుంటున్నారు. సెలబ్రిటీలు, దేవతలు, తమకు ఇష్టమైన వారి పేర్లతో పాటు ఫొటోలు వేయించుకుంటున్నారు. ముఖ్యంగా ప్రేమికులైతే తమ లవర్ పేరుతో పాటు ఫొటోలను ముద్రించుకొని ప్రేమను వ్యక్తపరుస్తున్నారు. అలాగే పిల్లలు పుడితే వారి కాలి, చేతి ముద్రలతో పాటు ముఖ చిత్రాలను ఛాతి మీద, చేతి భాగంలో డిజైన్‌గా వేయించుకుంటున్నారు. కొందరు అమ్మానాన్నల పేర్లు వేసుకునేందుకు ఇష్టపడుతున్నారు. మంచిర్యాల జిల్లాకు చెందిన బీఆర్ఎస్ నాయకుడు గోగుల రవీందర్ రెడ్డి తనకు ఇష్టమైన బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఫొటోను చేతిపై ముద్రించుకున్నాడు. అలాగే అరబిక్, హిందీ అక్షరాలవంటి డిజైన్లతో టాటుగా వేయించుకుంటున్నారు.

## జిల్లా వ్యాప్తంగా సెంటర్లు

గతంలో టాటూ వేసుకోవాలంటే నగరాలకు వెళ్లాల్సివచ్చేది. గోవా.. తదితర టూర్‌లకు వెళ్లినపుడు మాత్రమే అది కుదిరేది. నగరాలకే పరిమితమైన టాటూ కల్చర్.. ఇప్పుడు చిన్న పట్టాణాలకు సైతం విస్తరించింది. మంచిర్యాల జిల్లాలో ఎక్కడికక్కడ పదుల సంఖ్యల్లో టాటూ సెంటర్లు వెలిశాయి. ఇంచు డిజైన్ వేస్తే రూ.500, మల్టీ కలర్ అయితే రూ.900, త్రీడీ ఎఫెక్ట్‌తో వేసుకునే టాటూకి అంగుళానికి రూ.వెయ్యికి పైగా తీసుకుంటున్నారు. మరిన్నీ టాటూలకు సైజులు, డిజైన్లను బట్టి రూ.20 వేల నుంచి రూ. 50 వేల వరకు తీసుకోవడం గమనార్హం.







పేరు టాటు వేసుకున్న యువతులు





టాటు వేస్తున్న రవీందర్





కేటీఆర్ చిత్రాన్ని టాటు వేసుకున్న యువకుడు



## మార్కెట్‌లో మల్టీకలర్స్..

ప్రస్తుతం మార్కెట్లో నార్మల్, పర్మినెంట్, సెమీ పర్మినెంట్ డిజైన్లు అందుబాటులోకి వచ్చాయి. గతంలో వృద్ధుల చేతులపై పచ్చబొట్లు మాత్రమే కనిపించేవి. కానీ ప్రస్తుతం మల్టీకలర్స్‌తో లైఫ్ టైం ఉండేలా టాటూలు అందుబాటులోకి రావడం గమనార్హం.



వెరైటీ డిజైన్లతో టాటు



భర్త ఫొటో టాటుగా..

# ఔట్ సోర్సింగ్ మోసమెవరిది?

**కలెక్టర్ అలాట్‌మెంట్‌ను కాదని ఉన్నఫలంగా వేరే ఏజెన్సీకి ఎందుకిచ్చినట్లు?**

- గతంలో ఆదిలాబాద్ బీసీ హాస్టల్‌లోనూ రూ. 16 లక్షలు స్వాహా చేసింది ఇదే 'అక్షర'
- బాగోతం బయటపడడంతో ఏజెన్సీని మార్చే పనిలో యంత్రాంగం
- మరి బాధితుల పరిస్థితి ఏమిటన్నదానిపై స్పష్టత కరువు

మంచిర్యాల, డిసెంబర్ 18 (నమస్తే తెలంగాణ ప్రతినిధి) : మంచిర్యాల జిల్లా కొత్త కలెక్టరేట్‌లో ఔట్ సోరింగ్స్ ఉద్యోగాల పేరిట లక్షలు దండుకున్న ఏజెన్సీ అసలు కథ బట్టబయలవుతుంది. గార్డెనింగ్, సెక్యూరిటీ గార్డు, స్కావెంజర్స్, స్వీపర్స్‌గా ఉద్యోగాలు ఇప్పించి, జీతాలు ఇవ్వకుండా మోసం చేశారంటూ బాధితులు ప్రజావాణిలో ఫిర్యాదు చేయగా, ఈ నెల 15న నమస్తే తెలంగాణ 'ఔట్ సోర్సింగ్ పేరిట మోసం' శీర్షికన కథనం ప్రచురించింది. ఈ నేపథ్యంలో మరి కొంతమంది 'నమస్తే తెలంగాణ'తో తమ గోడును వెల్లబోసుకున్నారు. ఆ వివరాలు ఇలా.. మంచిర్యాల కలెక్టరేట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగాలకు సంబంధించిన కాంట్రాక్టును ముందు బెల్లంపల్లికి చెందిన భీమ్ ఎస్సీ అండ్ ఎస్టీ సోషల్ వెల్ఫేర్ సొసైటీకి అప్పగించారు. ఈ మేరకు ఇప్పుడున్న కలెక్టరే 07-07-2023 రోజున అలాట్‌మెంట్ లెటర్ సైతం ఇచ్చారు. కానీ ఆ తర్వాత వచ్చిన వరదలతో కొంత జాప్యం జరిగింది. అప్పుడే జిల్లా అధికారుల బదిలీలు అయ్యాయి. ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన ఇద్దరు అధికారులు అక్షర ఏజెన్సీ.. రూ.1.10 లక్షలకు కాంట్రాక్టు చేయడానికి ముందుకు వచ్చిందని చెప్పి.. తక్కువ డబ్బులకే పని చేస్తానంటున్నదని కాంట్రాక్ట్‌ను ఉన్న ఫలంగా అప్పగించేశారు.

## ఇక్కడే వసూళ్ల పర్వం..

కలెక్టరేట్ అధికారులు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో 11 మందిని నియమించుకునేందుకు అక్షర ఏజెన్సీకి అగ్రిమెంట్ చేసినట్లు సమాచారం. కాగా.. ఏజెన్సీ వాళ్లు ఏకంగా 23 మందిని నియమించారు. ఈ మేరకు ఒకొక్కరి దగ్గర నుంచి భారీ మొత్తంలో వసూళ్లకు తెరలేపారు. ప్రజావాణిలో ఫిర్యాదు చేసిన ఆరుగురు ఉద్యోగులు ఒకొక్కరి నుంచి రూ.50 వేల చొప్పున రూ.3 లక్షలు తీసుకుంటే.. మిగిలిన వారందరి దగ్గర కలిపి దాదాపు మరో రూ.30 లక్షల వరకు వసూలు చేసినట్లు ప్రాథమిక సమాచారం. నెలకు రూ.10 వేల జీతం వచ్చే పనికి రూ.లక్షన్నర నుంచి రూ.రెండు లక్షల వరకు వసూలు చేశారని తెలిసి అధికారులే నివ్వెరపోతున్నారు. ఇదే అక్షర ఏజెన్సీ గతంలోనూ ఇలాంటి అక్రమాలు చేసినట్లు నమస్తే తెలంగాణ ఎంక్వైరీలో తేలిసింది. ఆదిలాబాద్ బీసీ వెల్ఫేర్‌శాఖ ఆధీనంలోని పోస్టుమెట్రిక్ హాస్టల్లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాలు పెట్టి ఆరునెలలు ఎవరికీ వేతనాలు ఇవ్వకుండా రూ.16 లక్షల మోసం చేసింది ఈ అక్షర ఏజెన్సీయేనని తెలిసింది. ఈ విషయాలేవీ పరిశీలించకుండానే ఆ ఏజెన్సీకి కాంట్రాక్ట్ అప్పగించడం.. కలెక్టర్ అలాట్‌మెంట్‌ను పక్కనపెట్టి మరీ ఇలా చేయడం ఏమిటనే ప్రశ్నలు రేకెత్తుతున్నాయి. ముందే సరిగా చేయకుండా.. ఇప్పుడు విషయం బయటికి రావడంతో సదరు ఏజెన్సీని తొలగించి కొత్త వారికి బాధ్యతలు అప్పగించే దిశగా జిల్లా యంత్రాంగం చర్యలు తీసుకుంటుంది. అక్షరపై క్రిమినల్ కేసు సైతం పెట్టనున్నట్లు ఓ అధికారి తెలిపారు. కాగా అదే జరిగితే ఇప్పటికే ఉద్యోగాల్లో ఉన్న 23 మందిని కొనసాగిస్తారా.. వారికి రావాల్సిన వేతనాన్ని చెల్లిస్తారా.. వాళ్ల దగ్గర వసూలు చేసిన లక్షలాది రూపాయాల మాటేంటి... అసలు ఈ 23 మందిలో కొందరికి పూర్తిస్థాయి జీతాలు ఇచ్చామని సదరు ఏజెన్సీ నిర్వాహకులు చెప్తున్న మాటల్లో వాస్తవం ఎంత.. అసలు ఈ ఔట్ సోర్సింగ్ ఉద్యోగాల్లో ఏం జరిగింది అనేది ప్రశ్నార్థకంగా మారింది.

## ఏజెన్సీ మార్పు వెనుక మతలబేమిటో..?

వాస్తవానికి కలెక్టరేట్‌లో ఔట్‌సోర్సింగ్ ఉద్యోగాల కోసం నెలకు రూ.2 లక్షలపైనే అవసరమవుతాయి. పాత లెక్కల ప్రకారం నలుగురు సెక్యూరిటీ, ఒక సూపర్‌వైజర్, నలుగురు గార్డెనింగ్, ముగ్గురు స్కావెంజర్లు, ఏడుగురు స్వీపర్స్‌తో కలిసి మొత్తం 19 మంది అవసరం. బెల్లంపల్లి ఏజెన్సీకి అధికారులు అలాట్‌మెంట్ ఇచ్చినప్పుడు ఉన్న లెక్క ఇది. కానీ కొత్తగా వచ్చిన అధికారులు 11 మందికి రూ.1.10 లక్షలు ఇస్తే అయిపోతుందని చెప్పి మన జిల్లాతో ఎలాంటి సంబంధం లేని కరీంనగర్‌కు చెందిన ఏజెన్సీకి బాధత్యలు అప్పగించడం వెనుక మతలబేంటి అనేది చర్చనీయాంగా మారింది. నెలకు రూ.10 వేల జీతం ఇచ్చినా 11 మందికి రూ.1.10 లక్షలు అవుతాయి. మరి వారికి పీఎఫ్, ఈఎస్ఐ ఇవన్నీ కలిపితే మరింత అవసరం అవుతాయి. ఇవన్నీ తెలిసిన అధికారులు ఈ చిన్న లాజిక్ ఎలా మిస్ అయ్యారనేది అర్థం కావడం లేదు. జిల్లా స్థాయిలో ఓ పెద్ద అధికారి సహా మరో అధికారికి భారీ మొత్తంలో ముడుపులు ముట్టాయని.. అందుకే అక్షర ఏజెన్సీని ఎంపిక చేశారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో అధికారుల తదుపరి చర్యలపై సర్వత్రా ఆసక్తి నెలకొంది.



గాంధీ పార్కులో మిషన్ భగీరథ తాగునీరు అందించే ఓవర్‌హెడ్ ట్యాంకు

# ఇంటింటికీ భగీరథ నీరు

**రూ.1,318 కోట్లతో 692 ఆవాసాలకు ప్రయోజనం**

- కేటీఆర్ చేతుల మీదుగా ఇటీవల రూ.40 కోట్లతో తాగు నీటి పనులు
- నిర్మల్ పట్టణంలో 20,497 నల్లా కనెక్షన్‌లకు తాగునీరు
- మాజీ మంత్రి అల్లోల చొరవతో తీరిన కన్నీటి కష్టాలు

నిర్మల్ అర్బన్, డిసెంబర్ 18 : నిర్మల్ పట్టణవాసులకు నిరంతరం మిషన్ భగీరథ ద్వారా సురక్షితమైన నీరు సరఫరా అవుతోంది. నిర్మల్ జిల్లాలో 692 గ్రామాల పరిధిలోని 5.45 లక్షల మందికి తాగునీటి కోసం ప్రభుత్వం రూ.1,318 కోట్లతో ఇంటెక్ వెల్స్, పైప్‌లైన్ నిర్మాణాలను పూర్తి చేసి నీరు అందిస్తున్నది. 2003 సంవత్సరంలో నిర్మల్ పట్టణవాసుల దాహార్తిని తీర్చేందుకు అప్పటి ఎమ్మెల్యే అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి రూ.32 కోట్లతో శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి నిర్మల్ వరకు పైప్‌లైన్ వేయించారు. అనంతరం రూ.39.91 కోట్లతో పైప్‌లైన్ పనులను అప్పటి పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌తో ప్రారంభింపజేశారు. నిర్మల్ పట్టణంలో 117 కిలోమీటర్ల మిషన్ భగీరథ తాగునీటి పైప్‌లైన్ వేయించి 42 వార్డుల ప్రజలకు తాగునీటిని అందిస్తున్నారు.

## ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులతో నీటి సరఫరా

మిషన్ భగీరథ నీటిని 42 వార్డుల ప్రజలకు అందించడానికి తొమ్మిది వార్డుల చొప్పున ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులను నిర్మించారు. ఒక్కొక్కటి 39 లక్షల లీటర్ల సామర్థ్యం గల ఐదు ట్యాంకులతో నీటిని సరఫరా చేస్తున్నారు. గాంధీపార్కులో 10 లక్షల లీటర్ల సామర్థ్యంతో రూ.1.45 కోట్లతో నిర్మించిన ట్యాంకును ప్రారంభించారు. ఈ ట్యాంకు ద్వారా 11.20 కిలో మీటర్ల పరిధిలోని 10 వార్డు(శరద్ మహల్, బాగులవాడ, మోతి నగర్, నటరాజ్‌నగర్, బాగ్యనగర్, ఇందిరానగర్, మదీన కాలనీ, ప్రియదర్శినినగర్, జోహ్రనగర్, కళానగర్ కాలనీ)ల ప్రజలకు నీటిని అందిస్తున్నారు. అలాగే మిగతా నాలుగు ఓవర్ హెడ్ ట్యాంకులు 12 లక్షల లీటర్ల సామర్థ్యంతో ఇసురాళ్ల గుట్ట, ఐదు లక్షల లీటర్ల సామర్థ్యంతో విశ్వనాథ్‌పేట్, ఆరు లక్షల లీటర్ల సామర్థ్యంతో శాంతినగర్‌తో నిర్మించి వీటి ద్వారా నిరంతరం నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రియదర్శిని నగర్-సారగ్ కాలనీలో ట్యాంకు నిర్మాణం పూర్తి కాగా.. నీటిని సరఫరా చేయాల్సి ఉంది.

## నిర్మల్ నియోజకవర్గంలో..

నిర్మల్ నియోజకవర్గంలోని నిర్మల్ రూరల్, సోన్, లక్ష్మణచాంద, మామడ, సారంగాపూర్, దిలావర్‌పూర్, నర్సాపూర్ మండలాల్లోని 213 ఆవాసాలకు రూ.300 కోట్లతో పరిశుభ్రమైన తాగునీటిని ఇంటింటికీ అందిస్తున్నారు. ఇండ్లతోపాటు రైతు వేదికలకు, వైకుంఠధామాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, వసతి గృహాలకు, అంగన్‌వాడీ కేంద్రాలకు స్వచ్ఛమైన జలం అందుతోంది.

## మాజీ మంత్రి చొరవతో తీరిన కన్నీటి కష్టాలు

మాజీ మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి ప్రత్యేక చొరవతో చేపట్టిన ఈ పనులతో పట్టణ ప్రజలకు రానున్న 30 సంవత్సరాల వరకు ఎలాంటి తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు చేపట్టారు. పట్టణ ప్రజలకు రెండు వైపులా నీరు రానుంది. 2003 సంవత్సరంలో పోచంపాడు నుంచి సిద్ధాపూర్ వరకు వేసిన పైప్‌లైన్ మార్గం ద్వారా, మాటెగాం నుంచి ఇసురాళ్ల గుట్ట వరకు నీరు రాగా వాటిని ఐదు ఓవర్ హెడ్ ట్యాంకులలో నింపి పట్టణంలోని 207 కిలో మీటర్ల వరకు వేసిన పైప్‌లైన్ ద్వారా 20,497 కుటుంబాలకు నీటిని అందిస్తున్నారు. పట్టణ ప్రజలకు తాగునీటిలో ఇబ్బందులు తలెత్తితే శ్రీరాంసాగర్ ప్రాజెక్టు ద్వారా తాగునీటిని అందించేందుకు ముందస్తుగా చర్యలు చేపట్టారు.



### మంచిగా సౌలత్ అయింది..

వర్షాకాలం వచ్చిందంటే ఇబ్బందులు మొదలయ్యేవి. వాగు పొంగినప్పుడు అది ఇడిసేదాక ఆగుడే. లేకుంటే ఐదారు కిలోమీటర్లు లింగాపూర్ రోడ్డు మీదికెల్లి పోయేటోల్లం. వాగు అవుతల మేదరిగూడెం, నాగసముద్రం, మాకులపేట ఊరోల్లు పొలానికి రావాలన్నా కష్టం అయితుండే. అల్లీపూర్, గుడిరేవు, లక్ష్మీకాంతాపూర్ ఊరోల్లు కూడా ఇటు దిక్కు వచ్చేటోల్లు కాదు. అప్పటి తెలంగాణ సర్కారు మా సమస్యను గుర్తించి వంతెన కట్టింది. ఇప్పుడు మా కష్టాలు తీరినయ్.

*- జిల్లపెల్లి మల్లేశ్, గ్రామస్తులు, మోకాసిగూడెం*

### ఇబ్బందులు తొలిగినయ్..

వాగుపై వంతెన పూర్తి చేయడంతో మా ఇబ్బందులు తొలిగినయ్. మంచి పని చేసిన తెలంగాణ సర్కారును మరిచిపోం. మా గ్రామస్తుల కష్టాలు ఇక నుంచి తీరినట్లే. పిల్లలు బడికి పోవాలన్నా, పొలానికి పోవాలన్నా ఎన్నో తిప్పలు పడ్డాం. బ్రిడ్జి పూర్తి చేసి, మమ్ములను కేసీఆర్ సర్కారు ఆదుకున్నది. మూడు నెలల కింద దివాకర్‌రావు వచ్చి ప్రారంభించిండు. ఇప్పుడు సమస్యలు తొలిగిపోయినయ్. మూడు గ్రామాల కష్టాలు దూరమైనయ్.

*- జిల్లపెల్లి రవి, మోకాసిగూడెం.*



# నెరవేరిన వారధి కల

- రూ.1.58 కోట్లతో వంతెన నిర్మాణం
- నాడు లో లెవల్ పై రాకపోకలు
- నేడు తొలిగిన మోకాసిగూడ ప్రజల అవస్థలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న గ్రామస్తులు



పూర్తయిన మోకాసిగూడెం వంతెన

దండేపల్లి, డిసెంబర్ 18 : మంచిర్యాల జిల్లా దండేపల్లి మండలంలోని అల్లీపూర్ గ్రామ పంచాయతీ పరిధిలోని మోకాసిగూడెం ఓ మారుమూల గ్రామం. గ్రామానికి ఉన్న వాగుపై వంతెన సౌకర్యం లేక గ్రామస్తులు అవస్థలు పడుతున్నారు. వర్షాకాలం వచ్చిందంటే లో లెవల్ వంతెన మునిగేది. గ్రామస్తులు బిక్కుబిక్కు మంటూ గ్రామంలోనే ఉండాల్సి వచ్చేది. అత్యవసర పరిస్థితుల్లో నాలుగైదు కిలో మీటర్లు తిరిగి లింగాపూర్ మీదుగా ప్రధాన రహదారికి చేరుకోవాల్సి వచ్చేది. స్వరాష్ట్రం సాధించుకున్నాక గ్రామస్తుల కల సాకారమైంది. 2021లో అప్పటి ఎమ్మెల్యే నడిపెల్లి దివాకర్‌రావు సహకారంతో వాగుపై వంతెన నిర్మాణానికి కేసీఆర్ ప్రభుత్వం రూ.1.58 కోట్లు మంజూరు చేయడం, వంతెన పనులు చకచకా పూర్తి కావడంతో ఈ యేడాది సెప్టెంబర్ 16న నూతన వంతెనను దివాకర్‌రావు ప్రారంభించారు. దీంతో మోకాసిగూడ వాసుల సంతోషానికి అవధులు లేకుండా పోయాయి.

## భయం భయంగా.. లోలెవల్ వంతెన దాటుతూ..

మోకాసిగూడకు చెందిన విద్యార్థులు పాఠశాల, కళాశాలకు వెళ్లాలన్నా, నిత్యావసరాలు కొనుగోలు చేయాలన్నా, వైద్య సౌకర్యాలు పొందాలన్నా వాగు దాటాల్సిందే. ఎవరైనా అనారోగ్యం పాలైతే గ్రామానికి ఈ దారి గుండా 108 చేరుకోవాల్సిన పరిస్థితి. గర్భిణులను 102 వాహనంలో వైద్యపరీక్షలకు తీసుకువెళ్లాలన్నా ఇదే ఆధారం. వర్షాకాలంలో వాళ్లు పడ్డ కష్టాలు అన్ని ఇన్ని కావు. అప్పటి ఎమ్మెల్యే ప్రత్యేక శ్రద్ధతో 2021లో వంతెన మంజూరైంది.

## రూ.1.58 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులు

లో లెవల్ వంతెనపై నుంచి గ్రామస్తులు పడుతున్న కష్టాలను కేసీఆర్ ప్రభుత్వం గుర్తించి రూ.1.58 కోట్ల పీఎంజీఎస్‌వై నిధులు మంజూరు చేసింది. అప్పటి ఎమ్మెల్యే, ప్రజా ప్రతినిధుల చొరవతో గుత్తేదారు పనులు పూర్తి చేయడంతో వంతెన పూర్తయింది. దీంతో గ్రామస్తుల దశాబ్దాల కల నేరింది. ఇప్పుడు గ్రామం నుంచి ఇతర గ్రామాలకు వెళ్లాలన్నా, బయటి గ్రామాల ప్రజలకు ఇక్కడికి రావాలన్నా ఇబ్బందులు తొలిగిపోయాయి. మోకాసిగూడ నుండే కాక అల్లీపూర్, గుడిరేవు, లక్ష్మీకాంతాపూర్ గ్రామాల ప్రజలు కూడా ఇదే వంతెన పైనుంచి రాకపోకలు కొనసాగిస్తున్నారు. ఇది కేసీఆర్ సర్కారు వల్లే సాధ్యమైందని గ్రామస్తులు అంటున్నారు.